

టన్ను చీనీ రూ.20,100

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20,100, కనిష్టంగా రూ.3,500, సరాసరిన రూ.15 వేలు పలికాయి.



కిలో టమాట రూ.14

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.14, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

35.8°/11.2°

జిల్లా పరిధిలో గురువారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో మధ్వనవమి ఉత్సవం



హనుమద్ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం మధ్వనవమి ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలంకరణలో శ్రీవారు సాయంత్రం హనుమద్ వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాలు నెల రోజుల తర్వాత ప్రారంభమవుతాయని తెలపడమే ఈ ఉత్సవ ప్రాముఖ్యత. భక్తులు బ్రహ్మోత్సవాలకు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి కోరారు.

మద్యం దుకాణాల లాటరీ 10కి వాయిదా



పుట్టపర్తి టౌన్: కల్లు గీత కులాలకు ప్రభుత్వం కేటాయించిన మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ ఏడో తేదీ నుంచి పదో తేదీకి వాయిదా పడింది. ఈ మేరకు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి గోవింద్‌నాయక్ మీడియాకు వెల్లడించారు. జిల్లాలో 8 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో తొమ్మిది మద్యం దుకాణాలు కల్లు గీత ఉప కులాలకు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ దుకాణాలకు ఈ నెల ఎనిమిదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించే విధంగా వెసులుబాటు కల్పించారు. తొమ్మిదో తేదీ దరఖాస్తుల పరిశీలన, పదో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు కలెక్టర్ చేతన్ చేతులు మీదుగా లాటరీ డ్రా ద్వారా దుకాణాలు ఎంపిక చేస్తారు. మరిన్ని వివరాలకు పుట్టపర్తి సమీపంలోని ఉజ్వల ఫౌండేషన్‌లో ఉన్న ఎక్సైజ్‌అండ్ ప్రొహిబిషన్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

సక్రమంగా ఉంటేనే రిజిస్ట్రేషన్



రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ విజయలక్ష్మి

కదిరి టౌన్: డాక్యుమెంట్లు సక్రమంగా ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాలని స్టాంప్స్, రిజిస్ట్రేషన్ డీఐజీ విజయలక్ష్మి సూచించారు. గురువారం కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులుపై పత్రికల్లో వచ్చిన వాటి గురించి సిబ్బందిని విచారణ చేశారు. భూములకు సంబంధించి అన్ని డాకుమెంట్లు సక్రమంగా ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాలని ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ ఫణికుమార్‌కు సూచించారు.

హిందూపురం మార్కెట్‌కు ఇటీవల వచ్చిన బైవోల్టిన్ పట్టు గూళ్లు.. ధరలు

తేదీ	వచ్చిన పట్టుగూళ్లు (కిలోల్లో)	కనిష్ట ధర (రూపాయల్లో)	గరిష్ట ధర (రూపాయల్లో)	సగటు ధర (రూపాయల్లో)
జనవరి 28	1,353	525	791	731
జనవరి 30	1,904	477	811	775
ఫిబ్రవరి 1	3,524	536	823	762
ఫిబ్రవరి 5	465	559	839	755
ఫిబ్రవరి 6	2,116	750	823	792



పట్టుగూళ్లు అధరహో

- నగటు ధరల్లో ఆల్‌టైమ్ రికార్డ్
- చలికి తగ్గిన మల్బరీ పంట ఉత్పత్తి
- ధర పెరుగుదలతో రైతు దరహాసం

హిందూపురం అర్బన్: తెలుగు రాష్ట్రాల్లో పట్టుగూళ్ల మార్కెట్‌కు ప్రసిద్ధిగాంచిన హిందూపురంలో గురువారం నగటు ధరలు ఆల్‌టైమ్ రికార్డ్ నమోదు చేశాయి. ఏటా వెయ్యి టన్నుల వరకు పట్టు గూళ్లు ఇక్కడి మార్కెట్‌కు వస్తాయి. చలి తీవ్రత కారణంగా మల్బరీ పంట ఉత్పత్తి తగ్గింది. మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లకు డిమాండ్ ఉండడంతో ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గురువారం మార్కెట్ చరిత్రలోనే అత్యధిక రేట్లు పలికాయి. మార్కెట్‌కు రెండు రకాల పట్టుగూళ్లు వస్తాయి. అందులో బైవోల్టిన్ పట్టు గూళ్లు 96 శాతం రావడం విశేషం. మొత్తం 2,116 కిలోల పట్టు గూళ్లు రాగా.. ఇందులో మొదటి రకం నాణ్యమైన పట్టుగూళ్లు గరిష్ట ధర కిలో రూ.823 పలకగా, రెండో రకం రూ.792, కనిష్ట ధర రూ.750 పలికింది. మార్కెట్ చరిత్రలోనే నగటు రేట్ల రికార్డు నమోదైంది. పట్టు గూళ్ల ధరలు ఆశాజనకంగా ఉండడంతో మల్బరీ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు

ఉత్పత్తి తగ్గడంతోనే ధరల పెరుగుదల



మల్బరీ తోటలు చలికి సరిగా ఎదగక పోవడంతో పట్టుగూళ్ల ఉత్పత్తి తగ్గింది. సాధారణంగా మార్కెట్‌కు 4 నుంచి 11 టన్నుల వరకు పట్టు గూళ్లు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి వస్తాయి. పట్టుగూళ్ల ఉత్పత్తులు పెరిగే వరకు ధరలు ఎక్కువగానే ఉంటాయి. అయితే గురువారం మార్కెట్‌లో ఆల్‌టైమ్ రికార్డు ధరలు నమోదయ్యాయి. – లక్ష్మిరెడ్డి, మార్కెట్ ఇన్‌స్పెక్టర్, హిందూపురం

చింతపండు రికార్డు ధర

హిందూపురం అర్బన్: చింతపండు గరిష్ట ధర రికార్డు సృష్టించింది. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు గురువారం 364 క్వింటాళ్ల చింతపండు వచ్చింది. మొదటి రకం (కరిపులి) గరిష్ట ధర క్వింటాలు రూ.29 వేలు పలికింది. కనిష్టం రూ.8,200, నగటురూ.15వేలు చొప్పున క్రయవిక్రయాలు సాగాయి. ఇక రెండో రకం (ఫ్లవర్) క్వింటాలు గరిష్ట ధర రూ.9,500 పలికింది. కనిష్టం రూ.4వేలు, నగటు రూ.8,500, పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి.చంద్రమౌళి తెలిపారు. ప్రతి సోమ, గురువారాల్లో చింతపండు, మంగళ, శుక్రవారాల్లో మిర్చి క్రయ విక్రయాలు మార్కెట్‌లో జరుగుతున్నాయని, రైతులు నాణ్యమైన సరుకు తీసుకొచ్చి అమ్ముకోవాలన్నారు.



మార్కెట్‌కు వచ్చిన చింత పండు

కోళ్ల మరణాలపై అప్రమత్తం

అనంతపురం అగ్రికల్చర్: పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో కోళ్ల అసాధారణ మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు పశుసంవర్ధకశాఖ రెండు జిల్లాల జేడీలు డాక్టర్ జీపీ వెంకటస్వామి, డాక్టర్ జి.శుభదాస్, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ ఎస్.రామచంద్ర గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అధికారుల ఆదేశాల మేరకు గురువారం జిల్లాలో పలు ప్రాంతాల్లో పౌల్ట్రీ ఫారాలు సందర్శించి కోళ్ల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడా అలాంటి మరణాలు సంభవిస్తున్న దాఖలాలు లేవన్నారు. అనుమానిత ప్రాంతాలు, అవసరమైన చోట కోళ్ల నుంచి నమూనాలు సేకరిస్తున్నామన్నారు. ఎక్కడైనా అలాంటి అసాధారణ పరిస్థితులు ఉన్నట్లు గమనిస్తే వెంటనే పశువైద్యులను సంప్రదించాలని సూచించారు. చనిపోయిన కోళ్లను ఖాళీ స్థలాలు, బావులు, వాగులు, రోడ్డు పక్కన పడేయకూడదని, కచ్చితంగా గుంత తీసి పాతిపెట్టి పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అపోహలకు పోకుండా బాగా ఉడికించిన గుడ్లు, మాంసం తీసుకోవచ్చని పేర్కొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా షీలారెడ్డి



ప్రొఫెసర్ సి.షీలా రెడ్డి

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ తొలి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ సి. షీలా రెడ్డి నియమితులయ్యారు. వివిధ వర్సిటీల్లో పనిచేస్తున్న 15 మంది ప్రొఫెసర్లు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, ప్రొఫెసర్ సి. షీలా రెడ్డి రిజిస్ట్రార్‌గా ఎంపికయ్యారు. వర్సిటీ తొలి రిజిస్ట్రార్ ఆమే కావడం గమనార్హం. ప్రొఫెసర్ షీలారెడ్డికి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, గవర్నెన్స్, పబ్లిక్ పాలసీ, అంబేడ్కర్ థాట్ అండ్ ఫిలాసఫీ, ఇంటర్నేషనల్ రిలేషన్స్ అంశాలపై మంచి పట్టు ఉంది. 2006 నుంచి 2011 వరకు శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. శ్రీ వెంకటేశ్వర కళాశాల, యూనివర్సిటీ ఆఫ్ న్యూఢిల్లీలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. టీటీడీ నుంచి ఉత్తమ ఉద్యోగి అవార్డును అందుకున్నారు. నాణ్యమైన పరిశోధనలు, పాలనలో సమర్థత, విశేషమైన బోధనానుభవం ఉండడంతో రిజిస్ట్రార్‌గా షీలారెడ్డికి అవకాశం దక్కింది. కాగా, సెంట్రల్ యూనివర్సిటీ 2018లో అనంతపురంలో ఏర్పాటైంది. ప్రస్తుతం 17 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు వివిధ కోర్సులను అభ్యసిస్తున్నారు.

నవంబర్‌లో సత్యసాయి శత జయంతి

జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్, చిత్రంలో ఎస్పీ రత్న, జేసీ అభిషేక్‌కుమార్, ఎమ్మెల్యే సింధూరరెడ్డి, పక్కనే ఆమె మామ పల్లె రఘునాథరెడ్డి

ప్రశాంతి నిలయం: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు ఈ ఏడాది నవంబర్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సత్యసాయి శత జయంతి ఉత్సవాల ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ శత జయంతి వేడుకలకు దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, పొరపాట్లకు తావీయకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలన్నారు. విమానాశ్రయం, ఆర్టీసీ బస్టాండ్, చిత్రావతి నది సుందరీకరణ పనులు, మొబైల్ టాయిలెట్స్, రవాణా సేవలు, సురక్షితమైన తాగునీరు, మెడికల్ క్యాంపులు, పుట్టపర్తి పరిసరాలతో పాటు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలను కలిపే జిల్లాలోని రహదారుల మరమ్మతుల కోసం ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ధర్మవరం రైల్వేస్టేషన్, పుట్టపర్తి రైల్వేస్టేషన్‌లలో భక్తులకు అవసరమైన వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ తాత్కాలిక ఆశ్రయాలు, వసతి, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, భక్తుల రాకకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రముఖుల రాక నేపథ్యంలో హెలిప్యాడ్‌లు, ప్రశాంతి నిలయం చేరుకునేందుకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ధర్మవరం రైల్వేస్టేషన్ నుంచి పుట్టపర్తికి బస్సు కనెక్టివిటీ పెంచేందుకు ప్రత్యేక బస్సులు వేయాలని కోరారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ సుమారు 10 లక్షల మంది భక్తులు జయంత్యుత్సవాల్లో పాల్గొంటారన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్‌ను సమన్వయం చేసుకుని జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీ వి.రత్న, డీఆర్వో విజయ సారథి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులు రోమెల్, చలం, సృష్టి, ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ సంజీవయ్య, ఎస్‌సీపీఆర్ మురళీమోహన్, డీపీఓ సమత, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీరని అధికార దాహం!

ప్రభుత్వ అధికారిక సమావేశాలు, సమీక్షలు ఏవైనా సరే ఆయన ప్రత్యక్షమవుతారు. ఆయనేమైనా ఉన్నతాధికారా.. ప్రజాప్రతినిధా అంటే కానే కాదు. ఓ మాజీ ప్రజాప్రతినిధి. రాజకీయ పార్టీ నాయకుడు. గతంలో ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా, మంత్రిగా పనిచేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ టికెట్ ఇవ్వలేదు. సొంత పార్టీలోనే ఆయనపై అసమ్మతి రేగింది. దీంతో ఆయన కోడలుకు టికెట్ ఇచ్చారు. ఆమె గెలుపొందారు. ఎమ్మెల్యే హోదాలో ఆమె ఎక్కడ, ఏ కార్యక్రమంలో పాల్గొన్నా ఆమెతో సమ ప్రాధాన్యతగా అనధికారికంగా ప్రత్యక్షమవుతుంటారు. కోడలి చాటున పెత్తనం చెలాయిస్తున్న ఆయనపై పత్రికల్లో వచ్చినా తనకేమీ పట్టనట్టు.. తాను ప్రజల కోసం ఆ మాత్రం పని చేయక్కర్లేదా అని ఎదురుదాడికి దిగుతుంటారు. అంతే కాదు పార్టీ కార్యాలయంలోనే అధికారిక సమీక్షలు సైతం ఆయన నిర్వహిస్తుండడం గమనార్హం. ప్రజలు ఎన్నుకున్నది ఒకరిని అయితే అధికార దర్పం మరొకరు చూపిస్తుండడంపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. తాజాగా గురువారం సత్యసాయి శతజయంత్యుత్సవాలకు సంబంధించి కలెక్టర్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన దర్జాగా ఆశీనులయ్యారు. ఆయన ఏ హోదాతో సమావేశానికి హాజరైనట్లు అంటూ సామాజిక మాధ్యమాల్లో ట్రోల్స్ చేస్తున్నారు.



వందలాది మంది కన్యలు, ముత్తయిదువులు పూర్ణ కుంభాలతో భారీ ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

జై సునామ జకినీ మాతా

- కనులపండువగా జాతర

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో గురువారం సునామ జకినీ మాత జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో ఆరె కటికలు తరలివచ్చారు. సునామ జకినీ మాత ఆలయంలో తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వందలాది మంది కన్యలు, ముత్తయిదువులు గుత్తిలోని వాసవీ షిరిడీ సాయి బాబా దేవాలయం వద్ద నుంచి పూర్ణ కుంభాలతో సునామ జకినీ మాత ఆలయం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా 'జై శ్రీ సునామ జకినీ మాతాకీ, శ్రీ మల్కామ జకినీ మాతాకీ జై' అనే నినాదాలతో మార్మోగాయి. మిమిక్రీ, చిన్నారుల నత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సునామ జకినీ మాత ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆలూరు లక్ష్మణ రావు, ఆలయ ధర్మ కర్త సురేష్ రావు, కార్యానిర్వాహక అధ్యక్షుడు సాయినాథ్, మహిళా అధ్యక్షురాలు సరస్వతీ బాయి, ప్రధాన కార్యదర్శి భాస్కర్ రావు, కోశాధికారి సుధాకర్ రావు, ఉప కోశాధికారి బాబురావు, సాయి, అమర్, వేలాది మంది ఆరె కటికలు పాల్గొన్నారు.



ప్రత్యేకంగా తయారు చేసిన వాహనంలో జకినీ మాత ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న విద్యార్థులు, అధికారులు

అడవులను రక్షించుకోవాలి

పుట్టపర్తి టౌన్: అడవులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి అన్నారు. గురువారం పుట్టపర్తిలో పోలీస్, అటవీశాఖ అధికారులు విద్యార్థులు మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి 'అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు' అంటూ నినాదాలు చేశారు. అటవీ శాఖ అధికారి చక్రపాణి మాట్లాడుతూ జిల్లాలో 33 శాతం భూమి పచ్చదనంతో నిండి ఉండాలని, అయితే 13 శాతం మాత్రమే పచ్చదనం నిండి ఉందని పేర్కొన్నారు. అడవులను అగ్ని బారి నుంచి కాపాడుకోగలిగితే కొంత మేర లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. అడవులు, ఇతర ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించగలిగితే 33 శాతం లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్, అటవీ క్షేత్ర అధికారి యామినీ సరస్వతి అధికారులు శ్రీనివాసులు, గుర్రప్పతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



చిలమత్తూరు ఎస్సీ కాలనీలోని స్టోర్ వద్ద మండుటెండలో క్యూలో నిల్చున్న మహిళలు



ఓడీచెరువు తహసీల్దారు కార్యాలయం వద్ద జంబులవారిపల్లి కార్డుదారుల ఆందోళన

రేషన్‌కు తప్పని తిప్పలు

చిలమత్తూరు/ ఓడీ చెరువు: రేషన్ సరుకుల కోసం కార్డుదారులకు తిప్పలు తప్పడం లేదు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఇంటింటికీ రేషన్ పద్ధతికి స్వస్తి చెప్పి చౌకధాన్యపు దుకాణాల వద్దే ఇస్తున్నారు. అది కూడా అన్ని స్టోర్లూ ఒకేసారి పంపిణీ చేయడం లేదు. రెండు మూడు రోజులు ఒకస్టోర్‌లో వేసి తర్వాతే మరొక స్టోర్‌లో పంపిణీ మొదలు పెడుతున్నారు. దీనికితోడు రేషన్ సరుకులు దొరుకుతాయో లేదోనని కార్డుదారులు ఎక్కడ స్టోర్ తెరిస్తే అక్కడకు తండోపతండాలుగా వస్తున్నారు.

గంటల వ్యవధిలో 'నో స్టాక్'

ఓడీచెరువు మండలం డబురువారిపల్లిలోని చౌక డిపో – 22 డీలర్ లావణ్య రేషన్ సరిగా పంపిణీ చేయడం లేదని జంబులవారిపల్లి గ్రామస్తులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. గత నెలలో కూడా బియ్యం పంపిణీ చేయలేదని, ఈ నెల అయినా తీసుకుందామని వస్తే తొలిరోజే అదీ ఉదయం పది గంటలకే స్టాక్ అయిపోయిందని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతు కోసం రాజీలేని పోరాటం

- రైతాంగానికి అండగా వైఎస్సార్‌సీపీ
- మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


ధర్నాలో మాట్లాడుతున్న ఈరలక్కప్ప

అగళి: రైతాంగానికి అండగా వైఎస్సార్‌సీపీ ఉందని, ఈ క్రమంలో రైతు సంక్షేమానికి రాజీలేని పోరాటాలు సాగిస్తామని వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రైతు సమస్యలను పరిష్కరించాలంటూ గురువారం మడకశిరలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి పెద్దలు విఫలమయ్యారని మండిపడ్డారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉందన్న విషయం ఎన్నికల సమయంలో చంద్రబాబుకు తెలియదా? అని ప్రశ్నించారు. అయినా అలవి కాని హామీలతో అధికారం దక్కించుకున్న తర్వాత ప్రజలను, రైతాంగాన్ని నట్టేట ముంచారని మండిపడ్డారు. అన్నదాత సుఖీభవ కింద రైతలుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలన్నారు. రైతులకు పగటి పూటనే తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. హంద్రీ–నీవా ప్రాజెక్ట్ ప్రధాన కాలువను వెడల్పు చేసి, గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర ప్రాంతంలోని చివరి ఆయకట్టుకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు పూర్తి చేస్తే ఈ ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. 15 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండేలా హంద్రీ–నీవా ప్రధాన కాలువను, 1,500 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో మడకశిర బైపాస్ కెనాల్‌ను వెడల్పు చేయాలన్నారు. అగళి, అమరాపురం ఉప కాలువలను 500 క్యూసిక్ సామర్థ్యంతో నిర్మాణం చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు తగ్గించే విషయం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.

జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి మాట్లాడుతు.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ముందుగా దరఖాస్తు చేసుకున్న రైతులకు కాకుండా ఎలాంటి దరఖాస్తులు చేయని టీడీపీ నాయకులకు అప్పగించడం దారుణమన్నారు. అగళి మండలంలో విద్యుత్ సమస్య తీరాలంటే వెంటనే 132 కేవీ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వక్కలిగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, మడకశిర జెడ్పీటీసీ నరసింహమూర్తి, కో ఆప్షన్ సభ్యుడు నసీర్, సర్పంచ్ రామకృష్ణప్ప, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, నాయకులు జయరామప్ప, జయకుమార్, లోకేష్, స్టూడియో శ్రీనివాస్, రామిరెడ్డి, నరసింహరెడ్డి, సత్యనారాయణ, విజయ రంగేగౌడ్, హేమంత రాజు, సదానంద ఆరాధ్య, సూర్యనారాయణరెడ్డి, మంజునాథ్, నాగేంద్ర, రామచంద్రప్ప, ఈరన్న, మల్లికార్జున, నారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిందితుడి బైండోవర్


తహసీల్దార్ సుబ్బారావు వద్ద బైండోవర్ చేస్తున్న దృశ్యం

అగళి: పాత బంగారాన్ని మెరుగు పెడతానంటూ అందులో నుంచి కొంత బంగారాన్ని అపహరించిన నిందితుడిని తహసీల్దార్ ఎదుట పోలీసులు బైండోవర్ చేయించారు. అగళి మండలం ఇరిగేపల్లిలో బుధవారం ఓ వివాహిత మెడలోని 35 గ్రాముల బరువున్న బంగారం మాంగ్యలం చైన్‌ను మెరుగుపట్టిన తర్వాత అది 25 గ్రాములున్నట్లుగా గుర్తించిన స్థానికులు వెంటనే సదరు వ్యక్తిని బంధించి, పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. విచారణలో మోసగాడిని బిహార్‌కు చెంది దీపక్‌కుమార్ సాహుగా పోలీసులు గుర్తించారు. గురువారం ఉదయం తహసీల్దార్ సుబ్బారావు ఎదుట బైండోవర్ చేయించి, సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

పాత కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్

కదిరి టౌన్: గతంలో మట్కా, గంజాయి, పేకాట తదితర కేసుల్లో నిందితులుగా ఉన్నవారిని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సీఐ వి.నారాయణరెడ్డి గురువారం కౌన్సిలింగ్ ఇచ్చారు. మగ్గాల క్వార్టర్స్, రైల్వే స్టేషన్, బస్టాండ్, ఆర్ అండ్‌బీ బంగ్లా, జూనియర్ కాలేజ్ గ్రౌండ్, డిగ్రీ కాలేజ్ గ్రౌండ్, నానాదర్గా వెనుక రాత్రి పూట కొందరు మద్యం తాగడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని, మరోసారి ఇలాంటివి పునరావృతం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదే పదే నేరాలకు పాల్పడితే రౌడీ షీట్ ఓపెన్ చేస్తామన్నారు.

బాలికపై లైంగిక దాడి

- యువకుడిపై పోక్సో కేసు నమోదు

గార్లదిన్నె: కడుపునొప్పితో బాధపడుతున్న బిడ్డను ఆస్పత్రికి తీసుకెళ్లిన ఆ తల్లిదండ్రులు అసలు విషయం తెలిసి హతాశయులయ్యారు. మైనారిటీ తీరకనే తమ బిడ్డ మరో బిడ్డను కడుపులో మోస్తోందని తెలిసి న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. వివరాలు... జిల్లాలోని మరో ప్రాంతానికి చెందిన ఓ నిరుపేద కుటుంబం కొన్నేళ్ల గార్లదిన్నెకు వలస వచ్చి ఇందిరమ్మ కాలనీలో గుడిసె వేసుకుని నివాసముంటున్నారు. తమ కుమార్తె (మైనర్ బాలిక)తో కలసి గ్రామంలోని వీధుల్లో సంచరిసూత చెత్త సేకరించి, గుజరీకి వేయడం ద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో వారు నివాసముంటున్న ప్రాంతానికి చెందిన ఓ యువకుడు (వివాహితుడు).. బాలికను మాయమాటలతో లోబర్చుకుని పలుమార్లు తన శారీరక అవసరాలు తీర్చుకున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం బాలిక తనకు కడుపు నొప్పిగా ఉందంటూ తల్లిదండ్రులకు తెలపడంతో వారు స్థానిక ఆస్పత్రికి పిలుచుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆమె 7 నెలల గర్భంతో ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు బాలికను ఆరా తీయడంతో అసలు విషయం తెలిసింది. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ అనంతరం యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

దుర్గుణాలు వీడితే సమున్నత జీవితం


తమలోని దుర్గుణాలు నశించాలంటూ రాసిన చీటీలను అగ్నికీలల్లోకి వేస్తున్న దృశ్యం


సంగీతకచేరీ నిర్వహిస్తున్న జోన్ -5 దేశాల భక్తులు

ప్రశాంతి నిలయం: దుర్గుణాలు వీడిన మనిషి జీవితం సమున్నతంగా ఉంటుందని చైనాకు చెందిన సత్యసాయి భక్తులు అన్నారు. చైనా నూతన సంవత్సర వేడుకలను గురువారం సత్యసాయి మహాసమాధి చెంత ఘనంగా ముగిశాయి. అంతుకు ముందు నార్త్ – 6 వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన సంవత్సరంలో తమలోని దుర్గుణాలను రూపుమాపి, సనాతన ఆలోచనలతో మంచి జీవితాన్ని ప్రసాదించాలని కోరుతూ రాసిన చీటీలను అగ్నిగోళంలో వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జోన్–5 దేశాలకు చెందిన పలువురు వక్తలు మాట్లాడారు. సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి పాల్గొని చైనా నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. సత్యసాయి శత జయంతి వేడుకల్లో భాగస్వాములు కావాలంటూ రత్నాకర్‌రాజు పిలుపునిచ్చారు. అనంతరం సత్యసాయి మహాసమాధి చెంత నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను మంత్రముగ్ధులను చేసింది.

ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యం


సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇంటినీ ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పీ–4 పాలసీ అమలు చేస్తోందని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుంచి పీ–4 ప్రణాళికల అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ చేతన్ జిల్లా అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా తగ్గించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం రానున్న ఉగాది నుంచి పీ–4 పాలసీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. జిల్లా జనాభాలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఎన్జీఓలు, ఎన్ఆర్ఐలు, వాపారులు, స్థానిక నాయకులు, వివిధ రంగాల నిపుణులను భాగస్వామ్యం చేయడం, వారి ఆలోచనలను, మార్గదర్శకత్వాన్ని తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో ప్రజల నుంచి అభిప్రాయాన్ని సేకరించనున్నట్లు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర విజన్ –2047ను సక్రమంగా అమలు చేయడానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సీపీఓ విజయ్‌కుమార్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

- జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న హరికృష్ణ

మడకశిర: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ అన్నారు. సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు 8 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. గురువారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హరికృష్ణ మాట్లాడుతూ.. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి అవసరమైన శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళలు సైతం వాణిజ్య రంగంలో రాణించడానికి అవసరమైన శిక్షణ ఇస్తున్నామన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వ్యాపారాలను వివరించారు. ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేయడం, వ్యాపారంలో పాటించాల్సిన నియమ నిబంధనలు, ఖాతా పుస్తకాల నిర్వహణ, ఉత్పత్తి సామర్థ్యం, సేల్స్ మార్కెటింగ్ తదితర అంశాలపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక, వ్యాపార వేత్తలను తయారు చేయడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, సీడాప్ కోఆర్డినేటర్ ఆంజనేయులు, మాస్టర్ ట్రైనర్ సునేష్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో హిజ్రాల బాహాబాహీ

- స్థానిక హిజ్రాలపై రాళ్లతో దాడి చేసిన పావగడ హిజ్రాలు

మడకశిర: స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో గురువారం ఆంధ్ర, కర్ణాటకకు చెందిన హిజ్రాల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ జరిగింది. రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరులో భాగంగానే ఈ ఘర్షణ జరిగినట్లుగా భావిస్తున్నారు. వివరాలు.. గురువారం మడకశిర వారపు సంత కావడంతో స్థానిక హిజ్రాలు పలువురు దుకాణాల వద్దకు వెళ్లి డబ్బులు ఇప్పించుకుంటున్నారు. అదే సమయంలో ఆటోలో వచ్చిన కర్ణాటకలోని పావగడ ప్రాంతానికి చెందిన హిజ్రాలు అందరూ చూస్తుండగానే స్థానిక హిజ్రాలపై దాడికి దిగారు. దాడిని నివారించడానికి ప్రయత్నించిన ప్రజలను కూడా పావగడకు చెందిన హిజ్రాలు గట్టిగా హెచ్చరించారు. తమ అడ్డుకుంటే ఎంతటివారినైనా వదలబోమంటూ బెదిరింపులకు దిగారు. చేతికి అందిన రాళ్లను తీసుకుని మడకశిర హిజ్రాలపైకి రువ్వారు. ఘటనలో మడకశిరకు చెందిన హిజ్రాలకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ఇరువర్గాల వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కాగా, గతంలోనూ ఈ రెండు వర్గాల మధ్య మడకశిరలో ఘర్షణ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అప్పట్లో పరస్పర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. ఘటనపై సీఐ రాగిరి రామయ్య మాట్లాడుతూ... విచారణ చేసి తప్పు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఒప్పందాలు ఎన్నటికీ ఆదుకోవు

- రైతుల సంక్షేమం సమగ్ర చర్యల ద్వారానే సాధ్యం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


మాట్లాడుతున్న రాంభూపాల్ (చిత్రంలో) సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

అనంతపురం అర్బన్: కంపెనీలతో ఒప్పందాలు ఉద్యాన రైతులను ఎన్నటికీ ఆదుకోలేవని, సమగ్ర చర్యలు చేపట్టడం ద్వారానే పండ్ల తోటల రైతుల సంక్షేమం సాధ్యమవుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ అన్నారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్పతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతపురంలో ప్రభుత్వం నిర్వహించిన హార్టీకల్చర్ కాంక్లేవ్ ఈ ప్రాంత ఉద్యాన ఉత్పత్తుల గురించి ప్రచారానికి తోడ్పడిన తీరును సీపీఎం స్వాగతిస్తోందన్నారు. అయితే పండ్లతోటల రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు కంపెనీల ఒప్పందాలే పరిష్కారమన్నట్లు భావించడాన్ని ఆక్షేపించారు. పండ్లతోటల రైతులతో విస్తృతంగా చర్చించి వారిని ఆదుకోవడానికి అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకోవాలన్నారు. జిల్లాలో వరుస కరువులతో 15 ఏళ్లుగా వ్యవసాయం తీవ్ర సంక్షోభానికి గురైందన్నారు. ఈ పరిస్థితుల్లో సాగునీటి వనరుల అభివృద్ధిలో తక్షణ ప్రత్యామ్నాయంగా మైక్రో ఇరిగేషన్ అమలులోకి వచ్చిందన్నారు. ప్రభుత్వాలు సబ్సిడీతో డ్రిప్ పరికరాలు, రాయితీలు, ఉచిత విద్యుత్ ఇవ్వడం, ఉపాధి ద్వారా డ్రైలాండ్ హార్టికల్చర్ అభివృద్ధి చేయడంతో ఉద్యాపంటల సాగు పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో రైతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యతపై అధికారులు దృష్టి పెట్టక పోవడం బాధాకరమన్నారు. బుధవారం జరిగిన కాంక్లేవ్‌లో ఈ విషయం స్పష్టంగా కనిపించిందన్నారు. పండ్లతోటల రైతులను ఆదుకోవడానికి బదులు కంపెనీలు, ఒప్పందాలు చుట్టూ తిప్పారన్నారు. వందకు పైగా కంపెనీలు వస్తాయని ఆశిస్తే ఏడు కంపెనీలు మాత్రమే ఒప్పందాలు చేసుకున్నాయన్నారు. ఈ కార్యక్రమం ప్రచారానికి ఉపయోగపడిందే తప్ప రైతుల సమస్యలకు పరిష్కారం చూపలేదన్నారు. కంపెనీల ఒప్పందాలు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ వ్యవసాయ విధానంలో భాగమన్నారు. వీటి వల్ల కంపెనీలు బాగుపడతాయే తప్పా రైతులకు మేలు జరగదన్నారు.

పాడి ఆవుల అపహరణ

అమరాపురం: మండల కేంద్రంలో నివాసముంటున్న కాటప్పకు చెందిన రెండు పాడి ఆవులను దుండగులు అపహరించారు. బుధవారం రాత్రి తన రెండు ఆవులను ఇంటి బయట కట్టేశాడు. గురువారం తెల్లవారుజామున బయటికి వచ్చి చూడగా ఆవులు కనిపించలేదు. ఇరుగు పొరుగు వారిని లేపి వెతికినా ఫలితం లేక పోయింది. రూ.60 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. అలాగే, మద్దనకుంట గ్రామ రైతు చంద్రప్పకు చెందిన ఓ పాడి ఆవును, చిట్నడకు గ్రామంలో మరో ఆవును అపహరించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత పాడి రైతులు తెలిపారు.

'వర్చువల్ ల్యాబ్'పై అవగాహన

అనంతపురం: ఓటీపీఆర్ఐ విద్యార్థులకు వర్చువల్ ల్యాబ్ విధానంపై గురువారం అవగాహన కల్పించారు. వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. శంకర్ వర్చువల్ ల్యాబ్‌ను ఎలా అనుసంధానం చేయాలో విద్యార్థులకు వివరించారు. ఈ ప్రయోగశాల విస్తృత ప్రయోజనాలను ఒక గూగుల్ లింక్ ద్వారా వివిధ కళాశాలలకు సమాచారాన్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి. దుర్గాప్రసాద్, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం. మహేష్ తదితరులు పాల్గొన్నారు.


ఇస్తేమాలో ప్రసంగిస్తున్న ముస్లిం మత పెద్ద


పాల్గొన్న ముస్లింలు

తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు

- ఇస్తేమాలో ముస్లిం మత పెద్దలు

పెనుకొండ: తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని, పరాయి స్త్రీని సోదరితో సమానంగా చూడాలని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. పెనుకొండలోని కోనాపురం రహదారిలో ఉన్న చింతతోపు వద్ద ఏర్పాటు చేసిన ఇస్తేమాలో గురువారం వివిధ ప్రాంతాలకు ముస్లిం మత పెద్దలు ప్రసంగించారు. ఇస్తేమా అంటే ఇస్లాం గొప్పదనం, నమాజ్ యొక్క బలం, ఖురాన్ విశిష్టత తెలపడమేనన్నారు. ఇస్లాం పవిత్రతను వివరించారు. ముస్లింకు ఖురాన్, హిందువుకు భగవద్గీత, క్రిస్టియన్‌కు బైబిల్ ఎంతో పవిత్రమైందన్నారు. ఏ గ్రంథం తీసుకున్నా అందులోని సారాంశం ఒక్కటేనన్నారు. అన్య మతస్తులను గౌరవించాలన్నారు. దాన గుణం చాలా గొప్పదన్నారు. ఐదు పూటలా నమాజ్ చదివి మనస్ఫూర్తిగా దువా చేస్తే సకల రోగాలు నయమవుతాయన్నారు. రంజాన్ విశిష్టతను వివరించారు.

వ్యక్తి ఆత్మహత్య

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువుకు చెందిన రంగప్ప(52) ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... కూలి పనులతో జీవనం సాగిస్తున్న రంగప్ప కుటుంబ కలహాల నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి మద్యం సేవించి మైలేపల్లి సమీపంలో పట్టాలపైకి చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వ్యాపారి దుర్మరణం


మృతుడు రంగప్ప

మడకశిర: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిరలోని మారెమ్మగుడి వీధికి చెందిన రంగప్ప (50) గ్రామాల్లో జరిగే వారపు సంతల్లో ఉల్లి, వెల్లుల్లి విక్రయాలతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం మడకశిరలో వారపు సంత కావడంతో సరుకుతో వచ్చిన ఆయన.. మార్కెట్‌లో ఉల్లి, వెల్లుల్లి బస్తాలను దించి మధుగిరి ప్రధాన రోడ్డు పక్కకు బహిర్భూమికి వెళ్లి తిరిగి స్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. మృతుడికి భార్యా పిల్లలు ఉన్నారు. ఘటనపై సీఐ రాగిరి రామయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ మృతి

పెనుకొండ రూరల్: ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మూడు రోజుల క్రితం పెనుకొండ సమీపంలోని హరిపురం వై.జంక్షన్ వద్ద 44వ జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న విషయం తెలిసిందే. ఘటనలో కియా అనుబంధ పరిశ్రమలో పనిచేస్తున్న తిమ్మాపురం గ్రామానికి చెందిన గోపాల్ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు వెంటనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తొలుత అనంతపురానికి, అక్కడి నుంచి బెంగళూరుకు తీసుకెళ్లారు. అయితే పరిస్థితి విషమించడంతో బెంగళూరులోని ఆస్పత్రిలో గురువారం ఉదయం గోపాల్ మృతి చెందాడు. ఆయనకు భార్య శాంతమ్మ, ఓ కుమారుడు ఉన్నాడు. ఘటనపై కియా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మహిళపై దౌర్జన్యం.. కేసు నమోదు

కదిరి టౌన్: భూ వివాదంలో మహిళపై దౌర్జన్యం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన కొయ్య కాంతమ్మకు ఎస్‌జీఓ కాలనీ సర్వే నంబర్ 39, 40లో స్థలం ఉంది. ఈ స్థలంపై ఆమెకు ఆమె మరిది కూతురు అంజినమ్మకు మధ్య కొంతకాలంగా భూ వివాదం నడుస్తోంది. అయితే గురువారం అంజినమ్మ, ఆమె సోదరి లక్ష్మీదేవి, ఆమె తల్లి రామలక్ష్మి తదితరులు కొయ్య కాంతమ్మ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి సరిహద్దు రాళ్లను ధ్వంసం చేశారు. ప్రశ్నించిన కాంతమ్మను ''నీ అంతు చూస్తాం' అంటూ బెదిరించారు. దీంతో కాంతమ్మ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అంజినమ్మ, ఆమె సోదరి లక్ష్మీదేవి, తల్లి రామలక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద కందులతో నిరసన

- అధికారులు స్పందించలేదని తలుపులకు తాళం
- చెట్టుకిందే రెండు గంటలపాటు నిరీక్షించిన తహసీల్దార్
- తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతుసంఘం డిమాండ్


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఆందోళనకారులు

రాప్తాడు: కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుండా దళారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి మండిపడ్డారు. రాప్తాడులో కంది కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతులతో కలసి గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కందులను రాసిగా పోసి ధర్నా చేపట్టారు. అధికారులు స్పందించక పోవడంతో తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉదయం 10 నుంచి 12 గంటలకు వరకూ తహసీల్దార్ విజయకుమారి చెట్టు కిందనే నిరీక్షించాల్సి వచ్చింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... మండలంలో ఈ సారి కంది పంటను ఎక్కువగా సాగు చేశారన్నారు. ఈ క్రమంలో పంట దిగుబడులకు మార్కెటింగ్ సదుపాయం లేక ఇళ్లలోనే నిల్వచేసుకున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, క్వింటా రూ.7,550తో కాకుండా భారీగా పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా మరో రూ.2 వేలు పెంచి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉదాసీన వైఖరి కారణంగా ఇప్పటికే చాలా మంది రైతులు క్వింటా రూ.6 వేలతో దళారులకు విక్రయించి నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఏఈఓ రంజిత, వీఏఏ శ్రీనివాసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. త్వరలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని భరోసానిచ్చానా వినలేదు. దీంతో శుక్రవారం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ విజయకుమారి స్పష్టమైన హామీనివ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజినేయులు, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్బిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.